సాక్షి
కర్నూలు
మంగళవారం, 2, సెప్టెంబర్, 2025



ట్రిబుల్ ఐటీలో 'ఇస్రో' ప్రదర్శన

ట్రిబుల్ ఐటీడీఎంలో 'ఇస్రో స్పేస్ ఆన్ వీల్స్' అనే పేరుతో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థుల కోసం ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని ఇస్రో సైంటిస్టులు తెలిపారు. 8లో▸



శివయ్యా.. నీవే దిక్కు!

మల్లన్న చెంత నివాసముంటున్న దేవస్థాన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. ప్రత్యామ్నాయం చూపకుండా ఎలా పంపిస్తారని వీరు ప్రశ్నిస్తున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.59
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.438
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:79,324
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:68,707

న్యూస్‌రీల్

తొందరపడి ఉల్లి కోయవద్దు

కర్నూలు(అగ్రికల్చర్): హడావుడిగా ఉల్లి కోతలు కోసి మార్కెట్‌కు తీసుకురావద్దని జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1200 ధరతో ఉల్లి కొనుగోలు ప్రక్రియ ఈ నెల చివరి వరకు కొనసాగుతుందని, రైతులు తొందరపడి గడ్డలు పూర్తిగా ఊరక ముందే కోయవద్దన్నారు. ఇలా చేస్తే నాణ్యత దెబ్బతింటుందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉల్లి నారు నాటిన రోజు నుంచి కోతకు రావడానికి 100 నుంచి 120 రోజుల సమయం పడుతుందని, మంచి సైజులోకి వచ్చిన తర్వాత కోయాలని సూచించారు. హడావుడిగా కోసి నష్టపోవద్దని, కోసిన ఉల్లిని గ్రేడింగ్ చేసుకొని మార్కెట్‌కు తీసుకురావాలన్నారు.

ఫెర్టిలిటీ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ఫెర్టిలిటీ కేంద్రాలు(సంతాన సాఫల్య కేంద్రాలు) ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఈ కేంద్రాలు తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సరోగసి కేంద్రాలు రిజిస్ట్రేషన్ కోసం ఏఆర్‌టి నేషనల్ పోర్టల్‌లో అప్లికేషన్ పూర్తి చేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ దరఖాస్తు, సంబంధిత పత్రాలు జిల్లా స్థాయి ఇన్‌స్పెక్షన్ టీమ్ పరిశీలించిన అనంతరం జిల్లా స్థాయి కమిటీలో ఆమోదానికి ఉంచుతామని, ఆ తర్వాత అర్హత కలిగిన కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. ఈ సర్టిఫికెట్ ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇన్‌స్పెక్షన్ బృందం తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని ఫెర్టిలిటీ కేంద్రాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

15 వరకు బీఎస్ఎన్ఎల్ ఫ్రీడం ప్లాన్ పొడిగింపు

కర్నూలు(హాస్పిటల్): స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా ప్రవేశపెట్టిన బీఎస్ఎన్ఎల్ ఫ్రీడం ప్లాన్‌ను ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు ఆ సంస్థ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి. రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫ్రీడమ్ ప్లాన్ లేదా ఆజాది కా ఆఫర్ ద్వారా వినియోగదారులకు ఉచితంగా 4జీ సిమ్‌ను ఇస్తూ కేవలం రూ.1 రీ చార్జ్ ద్వారా 30 రోజుల పాటు ప్రతిరోజూ 2 జీబీ డేటా, అపరిమితమైన వాయిస్ కాల్స్, 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చన్నారు. ఈ ఆఫర్ కొత్తగా సిమ్ తీసుకునే వారికి, బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అయ్యే వారికి వర్తిస్తుందన్నారు. వినియోగదారులు వారికి సమీపంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా కేంద్రం, రిటైలర్‌ను సందర్శించి ఈ ఆఫర్‌ను పొందాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలోని వయోజన విద్యాశాఖలో పర్యవేక్షక పోస్టులకు డిప్యూటేషన్‌పై పని చేసేందుకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ టి.చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదోని డివిజన్‌లో మూడు, నంద్యాల డివిజన్‌లో రెండు పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. పది సంవత్సరాల ఉపాధ్యాయులుగా సర్వీస్ ఉండి, 45 సంవత్సరాల వయస్సు కలిగిన ఎస్‌జీటీ, పీఈటీలు, గ్రేడ్-2 భాషా పండితులు అర్హులని తెలిపారు. డీడీఓ(ఎంఈఓ/హెచ్ఎం)ల అనుమతితో సర్వీస్ ధ్రువీకరణ పత్రంతో పాటు ధ్రువీకరణ పత్రాలపై అటెస్టెడ్ చేయించి ఈ నెల 5వ తేదీలోపు వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో దరఖాస్తులను పరిశీలించి 9న త్రిసభ్య కమిటీ, జేసీ, డీఈఓ, వయోజన విద్య డీడీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

గుండె గుడిలో వైఎస్సార్



ప్రజల అవసరాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా పాలన అందించిన మహానేత వైఎస్సార్. ప్రభుత్వాలు మారినప్పటికీ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు నేటికీ అమలులో ఉన్నాయి. ప్రజలు తమ గుండెలో వైఎస్సార్‌కు గుడికట్టుకున్నారు. నల్లకాల్వలో ఏర్పాటు చేసిన స్మృతి వనానికి పోటెత్తుతున్నారు. 'రాజన్నా.. నిన్ను మేం మరువలేం' అంటున్నారు. నేడు(మంగళవారం) మహానేత వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రజలు స్వచ్ఛందంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

– కర్నూలు(అగ్రికల్చర్)/ఆలూరు/కోవెలకుంట్ల/ఆత్మకూరు/నందికొట్కూరు/కృష్ణగిరి

- మహానేతను మరచిపోలేని రాష్ట్ర ప్రజలు
- ఆరోగ్యశ్రీ పథకంతో పేదల గుండెలకు భరోసా
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు
- జలయజ్ఞంతో సాగులోకి వచ్చిన బీడు భూములు
- నేడు మహానేత వర్ధంతి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనా కాలన్ని స్వర్ణయుగంగా భావించవచ్చు. ముఖ్యమంత్రిగా 2004లో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఉచిత విద్యుత్ ఫైల్ మీద మొదటి సంతకం చేసి రైతులకు భరోసా ఇచ్చారు. ఆ కాలంలోనే ఉమ్మడి జిల్లాలో 2 లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశారు. ఆరోగ్య శ్రీ పేరుతో సామాన్యులకు కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్యం అందుబాటులోకి తెచ్చారు. జలయజ్ఞం చేపట్టి రైతులకు సాగునీటి సదుపాయం కల్పించారు. పోతిరెడ్డిపాడు రిజర్వాయర్ ప్రాణం పోశారు. వైఎస్సార్ హయాంలోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో కార్యరూపం దాల్చింది. ఈ పథకాన్ని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో కలసి ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లిలో శ్రీకారం చుట్టారు. 'ఉపాధి' నిధులతో డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్లతోటల సాగును ప్రోత్సహించారు. అప్పట్లోనే 8000 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేశారు. జిల్లాలో భూమిలేని నిరుపేదలకు ఆరు విడుతలగా 32 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని పంపిణీ చేశారు. సూక్ష్మసేద్యం అమలుకు ప్రత్యేకంగా ఏపీఎంఐపీని ఏర్పాటు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంటుతో ఉమ్మడి జిల్లాలో 2000 మంది ఉన్నత స్థానాలు పొందారు. వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయి.

ప్రజల జీవితాల్లో వెలుగులు

ఉమ్మడి కర్నూలు జిల్లా కరువు, కాటకాలకు నెలవుగా ఉండేది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 2023 ఏప్రిల్ 9న పాదయాత్రకు వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. మొత్తం 1460 కిలో మీటర్లు నడచి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను కళ్లారా చూశారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 150 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగింది. ఉమ్మడి రాష్ట్రానికి 2004లో ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టడంతోనే రైతులు, ఇతర అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు పరుచుకున్నాయి. ఐదున్నర ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ 29 సార్లు పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

'జల'సిరులు

- జలయజ్ఞంలో భాగంగా రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న అవుకు రిజర్వాయర్‌ను రూ. 70కోట్లతో నాలుగు టీఎంసీల సామర్థ్యానికి పెంచేందుకు 2005 నవంబర్‌లో వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. 2010 నాటికి పనులన్నీ పూర్తి కావడంతో 4టీఎంసీల నీళ్లు నింపుతూ వచ్చారు. రైతులు కాల్వల ద్వారా రెండు కార్లు పంటలు పండించుకుంటున్నారు. రిజర్వాయర్ ఏర్పాటుతో నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో 42,509 లక్షల ఎకరాలకు సాగు నీరు, అనేక గ్రామాలకు తాగునీరు అందుతోంది.
- నిత్యం కరువుతో అల్లాడుతున్న పత్తికొండ నియోజకవర్గంలో హంద్రీ–నీవా కాలువ ఏర్పాటు చేసి కృష్ణాజలాలతో సస్యశామలం చేశారు. కృష్ణగిరి, పందికోన రిజర్వాయర్లను ఏర్పాటు చేసి 80వేల ఎకరాలకు సాగు నీరు అందించే దిశగా చర్యలు తీసుకున్నారు. దేవనకొండ, తుగ్గలి, కృష్ణగిరి, డోన్ మండలంలోని 50 గ్రామాలకు, డోన్‌పట్టణానికి గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా రూ. 55కోట్లతో తాగునీరు అందించారు.
- నందికొట్కూరు నియోజకవర్గంలో మల్యాల, ముచ్చుమర్రి, నాగటూరు ఫేస్–1, ఫేస్–2, తాటిపాడు, ఇస్కాల, చెల్లిమిల, లింగాల, శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాలను వైఎస్సార్ మంజూరు చేశారు. దీంతో మెట్ట భూములు సస్యశ్యామలంగా మారాయి.
- పోతిరెడ్డిపాడు నుంచి 12 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే గతంలో తరలించేవారు. వైఎస్సార్ పాలనలో పోతిరెడ్డిపాడును వెడల్పు చేసి 40 వేల క్యూసెక్కుల నీటిని తరలించి రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించారు.



పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు



కృష్ణగిరి సమీపంలో హంద్రీనీవా కాలువలో పరుగులు తీస్తున్న కృష్ణాజాలాలు



అవుకు రిజర్వాయర్



నల్లమలలోని పావురాల గుట్ట ప్రాంతంలో చెల్లాచెదురుగా పడిన హెలికాప్టర్ శకలాలు (ఫైల్)

ఆ రోజు ఏం జరిగిందంటే..

సరిగ్గా 16 ఏళ్ల క్రితం.. 2009 సెప్టెంబర్ 2వ తేదీన చిత్తూరు జిల్లా అనుపల్లి గ్రామంలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అప్పటి సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి బెల్ 420 హెలికాప్టర్‌లో బయలుదేరారు. కొంత సమయం తర్వాత హెలికాప్టర్ కనిపించకపోవడంతో ఆందోళన మొదలైంది. అప్పటి ముఖ్యమంత్రి చిత్తూరు జిల్లా అనుపల్లికి చేరకపోవడంతో రాష్ట్ర ప్రజలందరిలో నరాలు తెగే ఉత్కంఠ ప్రారంభమైంది. హెలికాప్టర్ ప్రమాదంలో నల్లమలలోని నల్లకాల్వ సమీపంలో ఉన్న పావురాలగుట్టలో వైఎస్సార్ మృతి చెందినట్లు సెప్టెంబర్ 3న వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర ప్రజలు తమ ఆరాధ్య నేతను గుండెల్లో దాచుకున్నారు. మహానేతను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలో చూసుకుంటున్నారు.

ప్రజల ఆరాధ్య నేత



కర్నూలు టౌన్: దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల ఆరాధ్య నేత అని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కర్నూలులోని ఎస్‌బీఐ సర్కిల్ వద్ద మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తామన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి, పార్టీ నాయకులు పాల్గొంటారన్నారు.

సంక్షేమానికి మారు పేరు వైఎస్సార్



తన పాలనా కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జన హృదయ నేతగా నిలిచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మహానేత వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పాణ్యం అర్బన్ పరిధిలోని కల్లూరు షరీన్ నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పట్టపగలే మహిళ దారుణ హత్య

- ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, గాజులు, నగదు దోపిడీ



శివలీల (ఫైల్)

కర్నూలు: కర్నూలు శివారులోని గణేష్ నగర్ పక్కనున్న (కల్లూరు అర్బన్ 19వ వార్డు) సాయి వైభవ నగర్‌లో నివాసముంటున్న శివలీల(75) దారుణ హత్యకు గురయ్యారు. ఈమె భర్త కాటసాని సాంబశివారెడ్డి ఏడాదిన్నర క్రితం మరణించాడు. వీరికి కూతురు ఉమామహేశ్వరమ్మ, కొడుకు గంగాధర్ రెడ్డి సంతానం. కుమారుడు అమెరికాలో డాక్టర్ వృత్తిలో స్థిరపడ్డాడు. కూతురు ఉమామహేశ్వరమ్మ కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తోంది. ఈమె భర్త చంద్రశేఖర్‌రెడ్డి రిటైర్డ్ ఏసీటీఓ. వీరు వెంకటరమణ కాలనీలో నివాసముంటున్నారు. అయితే కూతురు ఉమామహేశ్వరమ్మ ప్రతిరోజూ తల్లి ఇంటికి వచ్చి చూసుకుని వెళ్లేది. సోమవారం ఉదయం కూడా తల్లి ఇంటి వద్ద నుంచే కళాశాలకు వెళ్లింది. ఇంట్లో వంట రూంలో ఒంటరిగా ఉన్న శివలీలపై మధ్యాహ్నం గుర్తు తెలియని దుండగులు పదునైన కత్తితో దాడి చేశారు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉండగా దుండగులు ఆమె ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, గాజులతో పాటు బీరువాలో ఉన్న కొంత నగదును మూటకట్టుకుని ఉడాయించారు. అల్లుడు చంద్రశేఖర్ రెడ్డి మధ్యాహ్నం ఇంటి వద్దకు వెళ్లిచూడగా ఆమె రక్తపు మడుగులో పడివుండగా వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ బాబు ప్రసాద్, సబ్ డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్ఐలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్యకు కారణాలపై కూతురు, అల్లుడుతో మాట్లాడారు. అయితే పనిమనిషి వరలక్ష్మి రెండు రోజుల క్రితం పని మానేసిందని, ఆమెపైనే అనుమానం ఉన్నట్లు పోలీసుల దృష్టికి తెచ్చారు. మృతురాలు శివలీల ఫోన్ కాల్ డేటా, పనిమనిషి వరలక్ష్మి ఎవరెవరితో మాట్లాడిందన్న కాల్ డేటా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డీఎస్సీ రెండో విడత వెరిఫికేషన్

కర్నూలు (సిటీ): డీఎస్సీలో ర్యాంకులు సాధించిన వారికి రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన నేడు (మంగళవారం) జరగనుంది. సర్టిఫికెట్ల పరిశీలనకు సోమవారం రాత్రి కమిటీలను ఏర్పాటు చేశారు. డీఎస్సీలో ర్యాంకులు సాధించిన 2,525 మందికి మొదటి విడతలో సర్టిఫికెట్లను పరిశీలించారు. రెండో విడతలో 80 నుంచి 120 మంది అభ్యర్థులకు అర్ధరాత్రి తర్వాత కాల్ లెటర్లు పంపిస్తామని, అందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధంగా ఉండాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే విద్యా శాఖ అధికారుల అంచనాల ప్రకారం సుమారు 200 అభ్యర్థులకు కాల్ లెటర్లు రావచ్చునని చర్చించుకుంటున్నారు. కాల్ లెటర్లు వచ్చినవారందరికీ రాయలసీమ యూనివర్సిటీలో సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు.

అనర్హులుగా ఆరుగురు

దివ్యాంగుల విభాగంలోని 64 మందికి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో రెండు రోజుల క్రితం వైకల్య పరీక్షలు నిర్వహించారు. వైకల్య ధ్రువీకరణ పత్రాల్లో ఉన్న శాతానికి మెడికల్ టెస్టులో వైద్యులు ఇచ్చిన దానికి తేడాలు ఉండటంతో ఆరుగురిని అనర్హులుగా గుర్తించారు.

రూ. 50 కోట్లతో పాణ్యం రైల్వేస్టేషన్

- ప్రారంభించిన సీఆర్ఎస్ మాధవి
- నంద్యాల–పాణ్యం మధ్య డబుల్ ట్రాక్‌కు గ్రీన్ సిగ్నల్



పాణ్యం రైల్వే స్టేషన్ ప్రారంభం అనంతరం సిగ్నల్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న సీఆర్ఎస్ మాధవి

పాణ్యం: పాత దాన్ని తొలగించి రూ. 50కోట్ల పైగా నిధులతో నూతనంగా పాణ్యం రైల్వే స్టేషన్‌ను నిర్మించారు. సోమవారం ప్రత్యేక రైలులో సీఆర్ఎస్ మాధవి ఇక్కడికి వచ్చి నూతన రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. స్టేషన్‌లో ఉన్న సిగ్నల్ సిస్టిమ్, స్టేషన్ విస్తీర్ణం, నూతంగా చేపట్టిన పనులు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఇది వరకే పాణ్యం– బేతంచెర్ల వరకు డబుల్ ట్రాక్ పనులు పూర్తి చేయగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న పాణ్యం–నంద్యాల మధ్య పనులు పూర్తి కావడంతో ప్రత్యేక ట్రాలీలో సీఆర్ఎస్ మాధవి పరిశీలించి, వాటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇదిలా ఉండగా పాణ్యం రైల్వే స్టేషన్‌లో ఔరంగబాద్–గుంటూరు రైలును ఆగేలా చూడాలని సీఆర్ఎస్ మాధవికి ప్రజలు వినతి పత్రం అందించారు. త్వరలోనే చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. గుంటూరు డీఆర్ఎం సుదేష్ణషేన్, గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, రైల్వే టెక్నికల్ ఇంజినీర్లు, రైల్వే ఇంజనీర్లు అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీద్దాం

సంపద సృష్టిస్తామని రూ.2 లక్షల కోట్లు అప్పు చేశారు

- ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాలు వివరించాలని పిలుపు
- మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యం
- మహిళా జోనల్ సదస్సులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి



సదస్సులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి

కర్నూలు(టౌన్): అధికారం కోసం అబద్దాలు చెప్పిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని నిలదీద్దామని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పిలుపు నిచ్చారు. సోమవారం కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా జోనల్ సదస్సు పార్టీ జిల్లా అధ్యక్షురాలు శశికళ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహిళల పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే మహిళా వ్యతిరేకి చంద్రబాబు అన్నారు. ఎన్నికల ముందు మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి ఏడాదిన్నర గడిచినా ఒక్కటీ అమలు చేయలేకపోయాడన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ సూపర్ ఫెయిల్యూర్ అన్నారు. దేశంలోనే అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర పాలనలో ప్రజా వ్యతిరేకత కూడగట్టుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పిన చంద్రబాబు ఏడాదిన్నర కాలంలోనే రూ.2 లక్షల కోట్లు అప్పు చేశాడన్నారు. జగనన్న వల్లే మహిళా సాధికారత సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. రాష్ట్రంలో 24 శాతం మద్యం అమ్మకాలు పెరగడంతోనే మహిళలపై దాడులు, అత్యాచారాలు అధికమయ్యాయన్నారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. జైళ్లకు పంపిస్తే భయపడే ప్రసక్తే లేదన్నారు. జగనన్న కోసం మరింత నిబద్ధతతో పని చేస్తామన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తామని, మహిళలకు ఈ ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరిస్తామన్నారు.
- ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్దాలు, మోసాలు చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని తెలిసే జగనన్న ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టామన్నారు. ప్రభుత్వం దిగి వచ్చి అరకొరగా ఒకటి, రెండు పథకాలు అమలు చేసిందన్నారు. జగనన్న హయంలో మహిళలు బంగారం కొనుగోలు చేస్తే, ఈ ప్రభుత్వంలో బంగారాన్ని అమ్ముకునే పరిస్థితులు ఉన్నాయన్నారు. శాంతి భద్రతలు క్షీణించినా హోంమంత్రి అని చోద్యం చూస్తుండటం శోచనీయమన్నారు.
- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సీఎం జగనన్న ఎంతో కృషి చేశారన్నారు. రాజకీయంగా 50 శాతం పదవులు మహిళలకు కేటాయించారన్నారు. ఎన్నికల్లో నామినేషన్లు వేయకుండా, ఓట్లు వేయకుండా పులివెందులలో టీడీపీ అరాచకాలు చేసి గెలుపొందడం సిగ్గుచేటన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ జగన్ సింగిల్‌గానే వస్తాడని, చంద్రబాబుకు ఇతర పార్టీలు ఉంటే తప్ప ఎన్నికల్లో గెలవలేడన్నారు.
- వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా మహిళా అధ్యక్షురాలు శశికళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం కన్నా అంతకు మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. ఏడాదిలోనే టీడీపీ, జనసేన, బీజేపీ నేతల కుమ్ములాటలు పెరిగిపోయాయన్నారు. జనసేన నేతల అవినీతికి అడ్డు లేకుండా పోయిందన్నారు. నిత్యం మహిళలపై లైంగిక దాడులు చేస్తున్నా అధికార పార్టీ నేతల ఆగడాలు హోంమంత్రికి కనిపించవా అని ప్రశ్నించారు.



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేవరకు మా పోరాటాన్ని కొనసాగిస్తామని నినదిస్తున్న మహిళలు

సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికళా రెడ్డి, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, రీజినల్ అధ్యక్షురాలు గాజుల శ్వేతారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, స్టాండింగ్ కమిటీ సభ్యులు మునెమ్మ, రేణుకా, కల్లా నాగవేణి రెడ్డి, భారతి, మంగమ్మతో పాటు నంద్యాల జిల్లా అధ్యక్షులు ఆర్.సుజాతమ్మ కడప జిల్లా అధ్యక్షురాలు తెలుగుపల్లి వెంకట సుబ్బమ్మ, అనంతపురం జిల్లా అధ్యక్షురాలు బి.శ్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవేణి, సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు సి.నాగమణి, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చుక్కలతో రాజన్న చిత్రం



నంద్యాల(అర్బన్): పట్టణ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ చుక్కలతో రాజన్న చిత్రాన్ని గీచారు. మైక్రో పెన్నుతో డ్రాయింగ్ చార్ట్‌పై చుక్కలు పెట్టుకుంటూ వైఎస్సార్ కొట్రాయిట్ చిత్రాన్ని వేశారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ.. మహానేత అనేక సంక్షేమ పథకాల చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. శరణు కోరిన వారికి కరుణ చూపించే మంచి వ్యక్తిగా, ఎప్పుడు నవ్వుతూ.. నవ్విస్తూ ఆప్యాయంగా పలకరించే దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా కొలువై ఉన్నారంటూ చిత్ర నివాళులు అర్పించారు.

అక్కను చూసేందుకు వచ్చి..

- ఫిట్స్‌తో కాల్వలో పడి వ్యక్తి మృతి

మహానంది: మహానందిలో గత కొంత కాలం నుంచి యాచిస్తూ జీవనం సాగిస్తున్న తన అక్కను చూసేందుకు వచ్చిన తమ్ముడు మూర్ఛకు గురై కాల్వలో పడి మృతి చెందిన విషాద ఘటన సోమవారం మహానందిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...బనగానపల్లె మండలం ఇల్లూరి కొత్తపేట గ్రామానికి చెందిన సుంకన్న(50) అక్క సుబ్బులక్ష్మమ్మ గత కొద్ది నెలలుగా మహానందిలో ఉంటుంది. విషయం తెలుసుకుని ఆమెను చూసేందుకు ఇక్కడికి వచ్చాడు. కరివేన సత్రం సమీపంలో ఉన్న కోనేరు నీరు బయటికి వచ్చే కాల్వ వద్ద కూర్చుని ఉండగా మూర్ఛకు గురై కాల్వలో పడిపోయాడు. ఎవరూ గుర్తించకపోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు మహానందికి చేరుకుని సుంకన్న మృతదేహాన్ని ఆటోలో తరలించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కాటం సుధాకర్ (ఫైల్)

నందికొట్కూరు: కొనేటమ్మపల్లె గ్రామంలో అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కాటం సుధాకర్ (60) అనే వ్యక్తి 2020 నుంచి దాదాపు ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గత ఐదేళ్లుగా పంటల సాగు కోసం బ్యాంకు, తెలిసిన బంధువులు, స్నేహితులు, గ్రామస్తుల వద్ద దాదాపు రూ.15 లక్షల మేర అప్పులు చేసినట్లు తెలిపారు. అయితే ఐదేళ్లుగా వరుసగా నష్టాలు రావడంతో అప్పులు పెరిగి పోయాయి. అప్పుల బాధతో తీవ్ర మనస్తాపం చెందిన సుధాకర్ శనివారం తెల్లవారుజామున పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. భార్య నీలమ్మ గుర్తించి వెంటనే 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే సోమవారం మధ్యాహ్నం కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బ్రాహ్మణకొట్కూరు పోలీసులు తెలిపారు.

శివయ్యా.. నీవే దిక్కు!



పెద్దసత్రంలో నివాసగృహాలు



పెద్దసత్రంలో నిరసన తెలుపుతున్న మహిళలు

- శ్రీశైలంలో శిథిలావస్థకు చేరిన పలు గృహా సముదాయాలు
- పెద్దసత్రం, శివసదనం, పొన్నూరు సత్రాల్లో సుమారు 223 గృహాలు
- గృహాలను ఖాళీ చేయాలని సూచించిన సాంకేతిక నిపుణులు
- నివాసితులకు దేవస్థానం నోటీసులు
- ప్రత్యామ్నాయం చూపాలంటున్న బాధితులు



శివసదనం

శ్రీశైలంటెంపుల్: మల్లన్న చెంత నివాసముంటున్న దేవస్థాన కాంట్రాక్ట్ బేసిక్, ఔట్ సోర్సింగ్, శానిటేషన్ సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులకు గూడు కరువై రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. దేవస్థానం పరిధిలోని పెద్దసత్రం, పొన్నూరు సత్రం, శివసదనం భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆయా భవనాల తొలగింపునకు దేవస్థానం చర్యలు చేపట్టింది. దీంతో అందులో నివాసముంటున్న వారిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడంతో అందరిలో ఆందోళన నెలకొంది. ప్రత్యామ్నాయం చూపకుండా ఎలా పంపిస్తారని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. దాదాపు 50 ఏళ్ల క్రితం శ్రీశైల ఆలయ సిబ్బంది వసతి గృహాల కోసం దేవస్థానం పెద్దసత్రం, శివసదనం, పొన్నూరు సత్రాల పేరుతో గృహ సముదాయాలను నిర్మించింది. ఈ మూడింటిలో 223 నివాసాలు ఉన్నాయి. కాలక్రమేణ దేవస్థాన అధికారులు, సిబ్బందికి మరొక గృహ సముదాయాలను నిర్మించడం, ఆయా వసతి గృహాలకు ఉద్యోగులు తరలివెళ్లారు. దీంతో పెద్దసత్రం, పొన్నూరు సత్రం, శివసదనంలో దేవస్థాన కాంట్రాక్ట్ బేసిక్, ఔట్ సోర్సింగ్, శానిటేషన్ సిబ్బంది, మరికొంత మంది ప్రైవేట్ వ్యక్తులు నివాసం ఉంటున్నారు. అయితే ఆయా భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని నివాసితులు అడపాదడపా మరమ్మతులు చేయించుకుని అలాగే నివసిస్తున్నారు. ఈ భవనాల నిర్దిష్ట ఆయుర్ధాయ కాలపరిమితి (బిల్డింగ్ లైఫ్ స్పాన్) ముగింపు దశకు చేరుకుందని రహదారులు–భవనాలు (ఆర్అండ్‌బీ), పంచాయతీరాజ్ శాఖల సాంకేతిక నిపుణులు పరిశీలించి, దేవస్థానానికి నివేదిక సమర్పించారు. నివాసితుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు భవనాలలో నివాసితులను ఖాళీ చేయించి, భవనాలను తొలగించాలని దేవస్థానం నిర్ణయించింది.

నివాసితులకు నోటీసులు..

పెద్దసత్రం, పొన్నూరు సత్రం, శివసదనంలో నివసిస్తున్న దేవస్థాన ఉద్యోగులకు, ఇతర నివాసితులకు దేవస్థానం నోటీసులు జారీ చేస్తుంది. నోటీసులు అందిన ఒక నెలలో వారి నివాసాలను ఖాళీ చేయాలని లిఖితపూర్వకమైన నోటీసులు ఇస్తున్నారు. ఈ విషయమై నివాసితులందరు కూడా దేవస్థానానికి సహకరించాలని తెలియజేస్తున్నారు. అయితే నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన అధికారులను పెద్దసత్రం నివాసితులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఇద్దరు, ముగ్గురికి నోటీసులు ఇచ్చిన అధికారులు నిరసనతో వెనుదిరిగి వెళ్లారు.

కమిటీ వేశాం



పెద్దసత్రం, శివసదనం, పొన్నూరు సత్రంలో గృహాలు ఎప్పుడో 60 ఏళ్ల క్రితం నిర్మించినవి. తక్షణమే ఖాళీ చేయాలని నిపుణులు చెబుతున్నారు. ఆయా గృహ సముదాయంలో ఉన్న దేవస్థానం ఉద్యోగులకు ప్రత్యామ్నాయం చూపేందుకు ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో కమిటీ వేశాం. వారిని ఖాళీ చేస్తే వారికి మంచిగా ఏమి చేయాలో కమిటీ నిర్ణయిస్తుంది. ఆయా గృహ సముదాయాల్లో ప్రైవేట్ వ్యక్తులు సైతం ఉన్నారు. అందరికి నోటీసులు ఇచ్చి, అందరిని ఖాళీ చేయిస్తాం.

– ఎం.శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

ఇద్దరు పిల్లలతో ఎలా బతకాలి

నేను దేవస్థానంలో స్వీపర్ పనిచేసుకుని జీవిస్తున్నాను. నాకు భర్త కూడా లేడు. ఇద్దరు పిల్లలతో నేను పెద్దసత్రంలో నివాసం ఉంటున్నాను. ఉన్నఫలంగా ఇంటిని ఖాళీ చేయమంటే ఎక్కడి వెళ్లాలి.. ఎలా బతకాలి?. దేవస్థాన రెవెన్యూ సెక్షన్ వారు నాకు నోటీసులు ఇచ్చారు. నాకు వచ్చే జీతంతో అద్దె ఇంట్లో ఉండలేను. దేవస్థానం ఇల్లు కట్టించి ఇవ్వాలి.

– నాగలక్ష్మమ్మ, పెద్దసత్రం నివాసి

మాకు స్థలాలు ఇప్పించాలి

శ్రీశైల దేవస్థానాన్ని నమ్ముకుని కొన్ని సంవత్సరాల నుంచి జీవిస్తున్నాం. తక్కువ జీతాలు వచ్చినప్పటికి, దేవస్థానం వసతి గృహాల్లో అద్దెలు తక్కువ ఉండడంతో ఇప్పటి వరకు జీవనం సాగిస్తున్నాం. ఉన్నఫలంగా గృహ సముదాయాలను ఖాళీ చేయాలంటే మా పరిస్థితి ఏమిటి. మాకు ప్రత్యామ్నాయంగా శ్రీశైలంలోనే ఇంటి స్థలాలను ఇప్పించాలి. లేకుంటే మేము పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తాం.

– లలిత, పెద్దసత్రం నివాసి

ప్రత్యామ్నాయం చూపించండి

మేము ఉంటున్న పెద్దసత్రం శిథిలావస్థకు చేరిందని అధికారులు చెబుతున్నారు. వారు చెప్పిన ప్రకారం దేవస్థానానికి సహకరించి ఖాళీ చేస్తాం. కానీ మాకు ప్రత్యామ్నాయంగా ఇల్లు కానీ.. స్థలం కానీ చూపించాలి. అధికారులు కూడా మానవతాదృక్పదంతో మావైపు నుంచి ఆలోచించాలి. చిన్న జీతాల వాళ్లం. అద్దె ఇంటికి వెళితే పిల్లల చదువులు ఎలా గడుస్తాయి.

– వెంకటేశ్వరమ్మ, పెద్ద సత్రం నివాసి

ట్రిబుల్ ఐటీలో 'ఇస్రో' ప్రదర్శన



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌యూ వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు



ఇస్రో స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ బస్సు లోపలి భాగం



ప్రదర్శన గురించి విద్యార్థులకు వివరిస్తున్న ట్రిబుల్‌ఐటీ విద్యార్థిని

- ప్రారంభించిన ఆర్‌యూ వీసీ
- ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు

కర్నూలు సిటీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిబుల్ ఐటీడీఎం)లో 'ఇస్రో స్పేస్ ఆన్ వీల్స్' అనే పేరుతో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఆచార్య వి.వెంకట బసవ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయంతో ప్రపంచంలోని దేశాలన్నీ భారతదేశం వైపు చూశాయన్నారు. అంతరిక్ష పరిజ్ఞానాన్ని ప్రజలకు విద్యార్థులకు తెలియజేసేందుకు స్పేస్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ట్రిబుల్ ఐటీడీఎంలో ఏర్పాటు చేశామని ఇస్రో సైంటిస్టులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తి, అవగహన పెరుగుతుందన్నారు. అంతరిక్షం గురించి తెలియజేసేందుకు ప్రదర్శన ఉపయోగపడుతుందన్నారు.

రూ.10 కోట్ల ఖర్చు

ఇస్రో ప్రత్యేకంగా రూ.10 కోట్లు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో 50 ఏళ్ల నుంచి ఇస్రో సాధించిన విజయాల నుంచి చంద్రయాన్ వరకు సాధించిన విజయాల గురించి విద్యార్థులకు తెలియజేసేందుకు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. జిల్లాలోని 33 స్కూల్స్, కాలేజీలకు చెందిన 2 వేల మంది విద్యార్థులు ఈ ప్రదర్శనకు ఉపయోగపడనుంది. బస్సుల్లోని రాకెట్ల నమూనాలు, చంద్రయాన్‌ల గురించి ట్రిబుల్‌ఐటీ విద్యార్థులు, ఇస్రో ప్రతినిధులు వివరించారు. స్కూల్, కాలేజీల విద్యార్థులు ఎంతో ఆసక్తితో రాకెట్లను స్వయంగా చూసి అడిగి తెలుసుకున్నారు. నేడు(మంగళవారం)ఇస్రో బస్సు కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీలో ప్రదర్శన ఉన్నట్లు ఇస్రో ప్రతినిధులు తెలిపారు. ట్రిబుల్ ఐటీ రిజిస్ట్రార్ రాజ్‌కుమార్, ఆర్‌యూ రిజిస్ట్రార్ బి.విజయ్‌కుమార్, ఆచార్యులు డీన్స్ నరేష్, సత్యబాబు, ఆర్డినేటర్ డా.వినయ్ తివారీ, ఇస్రో రిటైర్డ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విల'పింఛన్'

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారు ఇంటి వద్దనే పింఛన్ అందుకునే వారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏడాదిగా వీరికి కష్టాలు ప్రారంభమయ్యాయి. ప్రతి నెలా చెట్ల కింద, గ్రామ సచివాలయాల్లో, వీధుల్లో గంటల తరబడి ఎదురు చూస్తూ కన్నీళ్లే మిగులుతున్నాయి. అష్ట కష్టాలు పడి పింఛన్లు అందుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు కాకుండా టీడీపీ నేతలు పింఛన్లు పంపిణీ చేస్తూ ఇదేదో పార్టీ కార్యక్రమం అన్నట్లు హంగామా చేస్తున్నారు.

అవ్వకు తప్పని తిప్పలు



ఈ చిత్రంలో పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధురాలు పేరు బోయ ఫలాక్షి. అవ్వ ఉదయాన్నే 8 గంటలకు సి.బెళగల్ గ్రామ సచివాలయం–1 దగ్గర వెళ్లారు. అక్కడి ఉద్యోగులు తమ పరిధిలో పింఛన్ డబ్బు లేదని, సచివాలయం – 2కు వెళ్లాలని చెప్పారు. దీంతో అవ్వ అవస్థలు పడుతూ అక్కడికి వెళ్లగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో అవ్వకు పింఛన్ ఇచ్చారు.

కన్నీరే మిగిలింది



తన కష్టాన్ని చెబుతున్న అవ్వ పేరు వడ్డె సుంకుమ్మ. సి. బెళగల్‌లోని ఎన్టీఆర్ కాలనీ చెందిన ఈమెకు ఇంటి దగ్గర పింఛన్ ఇవ్వలేదు. తన లాగిన్‌లో పింఛన్ డబ్బులు రాలేదని ఉద్యోగి చెప్పడంతో అవ్వ అవస్థలు పడుతూ సచివాలయానికి వచ్చారు. అక్కడ ఉద్యోగులు మధ్యాహ్నం వరకు స్పందించక పోవడంతో తీవ్ర మనోవేదనతో కన్నీరు పెట్టుకున్నారు. విషయం తెలిసి ఏఎస్ఎం వచ్చి అవ్వకు సచివాలయం దగ్గర పింఛన్ డబ్బులను అందించారు.

టీడీపీ కార్యక్రమం



సి. బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి గ్రామంలో పింఛన్ల పంపిణీని టీడీపీ కార్యక్రమంగా మలిచారు. ఇందుకోసం కొంతమంది లబ్ధిదారులను సమీకరించారు. వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకు వెళ్లకుండా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి.. సచివాలయం బయట పింఛన్ పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యక్రమంలో టీడీపీ జెండాలు ప్రదర్శన చేయడం, ఫ్లెక్సీని చూపడం విమర్శలకు తావిచ్చింది. – సి.బెళగల్

తప్పని నిరీక్షణ



ఇళ్ల వద్ద కాకుండా గ్రామ సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడుతూ సోమవారం కోడుమూరు గ్రామ సచివాలయానికి వచ్చారు. ఆన్‌లైన్ సమస్యలతో ఉద్యోగులు ఇబ్బంది పడుతూ వీరిని పట్టించుకోలేదు. దివ్యాంగులు, వృద్ధులు చాలా మంది పింఛన్ కోసం కార్యాలయం ఎదుట అరుగుపై గంటల తరబడి నిరీక్షించారు. – కోడుమూరు రూరల్

నిలబడినా దొరకని 'భరోసా'



వారు ఎక్కువ సేపు నిలబడలేరు.. కంటి చూపు కూడా అంతంత మాత్రమే.. అలాంటి వారికి ఇంటికి వెళ్లి పింఛన్ ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. హంప గ్రామంలో సోమవారం ఆలయం వద్ద చెట్టు కిందకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు సాయంత్రం వరకు నిలబడాల్సి వచ్చింది. సర్వర్ రావడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. మద్దికెరలో సాయంత్రం మూడు గంటలయినా పింఛన్ పంపిణీ చేయలేదు. – మద్దికెర

గుట్టుచప్పుడుగా..

పింఛన్లు తొలగించామనే గుట్టు తెలీయకుండా కూటమి ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అవలంబిస్తోంది. మంత్రాలయం సచివాలయం–3లో ఈ దృశ్యం కనిపించింది. అధికారులు ఇంటింటికి వెళ్లకుండా గుట్టుగా సచివాలయం–3 కార్యాలయం తలుపులు వేసి లోపల పింఛన్లు పంపిణీ చేశారు.

– మంత్రాలయం రూరల్





జిల్లాలో 2,22,388 పింఛన్లు పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లాలో 2,39,256 పింఛన్లు ఉండగా.. సాయంత్రం 5.30 గంటల సమయానికి 2,22,388 పింఛన్లు పంపిణీ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎప్పటిలానే ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ అభాసుపాలైంది. సచివాలయ ఉద్యోగులు పింఛనుదారులందరినీ ఒకచోటకు పిలిచి పంపిణీ చేయడం.. సచివాలయాలకు, రచ్చబండల వద్దకు పిలిపించుకోవడం విమర్శలకు తావిస్తోంది.

కుక్కకు మత్తు బిస్కెట్లు వేసి.. ఇంటి తాళాలు పగులగొట్టి

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలోని సింహపురి ఎస్టేట్‌లో చోరీ జరిగింది. కోసిగి పీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వంశీకృష్ణ శనివారం ఇంటికి తాళాలు వేసి గుంతకల్లులో ఉన్న తన భార్య వద్దకు వెళ్లారు. కాపౌండ్‌లో కుక్కను వదిలి వెళ్లాడు. కాగా ఇంటి తలుపులు పగిలి ఉండటాన్ని ఆదివారం సాయంత్రం గమనించిన స్థానికులు వెంటనే వంశీకృష్ణకు సమాచారం ఇచ్చారు. దొంగలు కాపౌండ్‌లో ఉన్న కుక్కకు మత్తు బిస్కెట్లు వేసి, తర్వాత దానిని కట్టేసి ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.45 వేలు విలువ చేసే వెండి వస్తువులు దొంగలించారు. అలాగే స్థానికంగా మరో రెండు ఇళ్లల్లో చోరీకి యత్నించారు. ఓ ఇంటిలో ఎవరూ నివాసం లేకపోవడం, మరో ఇంటికి సెంట్రల్ లాక్ కారణంగా తాళాలు తెరుచుకోక పోవడంతో దుండగులు వెనుదిరిగినట్లు తెలిసింది. బాధితుడు వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సుల కోసం విద్యార్థులు, అధ్యాపకులు నిరీక్షణ



కాలేజీ వద్ద ఆదోని బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, లెక్చరర్లు

హొళగుంద: స్థానిక జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు, లెక్చరర్లు సోమవారం ఆర్టీసీ బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాశారు. సాయంత్రం కళాశాల తరగతులు ముగిసిన తరువాత ఆదోని మార్గంలో హెబ్బటం, లింగంపల్లి, వందవాగిలి తదితర గ్రామాలకు చెందిన దాదాపు 30 మందికి పైగా విద్యార్థులతో పాటు ఆదోనికి వెళ్లే లెక్చరర్లు కళాశాల వద్ద బస్సుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ప్రతిరోజు ఈ మార్గంలో తిరుగుతున్న టెన్ సింగిల్, కోగిలతోట సర్వీస్ బస్సులు సోమవారం మరమ్మతులకు గురై తిరగలేదు. దీంతో కాలేజీ వదిలిన తర్వాత విద్యార్థులు చీకటి పడినా బస్సు కోసం అక్కడే ఉండాల్సి వచ్చింది. 7 గంటల తరువాత బస్సు రావడంతో ఎట్టకేలకు విద్యార్థులు తమ గ్రామాలకు బయలుదేరారు. ఈ సమస్య చాలా సార్లు ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని హొళగుంద–ఢణాపురం రోడ్డు దారుణంగా ఉండడంతో బస్సులు చెడిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. లింగంపల్లికి చెందిన విద్యార్థులు లింగంపల్లి క్రాస్‌లోనే దిగి అక్కడి నుంచి గ్రామం చేరుకోవడానికి దాదాపు రెండు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుందని ఇలా చీకటి పడినా బస్సులు రాకపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సకాలంలో బస్సులు లేకపోవడంతో ఉదయం వేళ విద్యార్థులు కొన్ని తరగతులు హాజరు కాలేకపోతున్నారు. ఆర్అండ్‌బీ, ఆర్టీసీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేసి వేళకు బస్సులు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రేడింగ్ లేకుండా వేరుశనగ కొనుగోళ్లు

- నేడు వేరుశనగకాయల మార్కెట్ ప్రారంభం

ఆదోని అర్బన్: మార్కెట్ యార్డుకు వచ్చిన వేరుశనగను గ్రేడింగ్ చేయకుండా కొనుగోలు చేయాలని కమీషన్ ఏజెంట్లను, వ్యాపారులను సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టు కింద 15 రోజులు ఈ విధానాన్ని నడిపించాలని సూచించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. వేరుశనగకాయలను ఆరబోయకుండా కేవలం రాశిపైనే లాభం వచ్చే ధరకు టెండర్ వేయాలని సబ్ కలెక్టర్ సూచించారు. పైలట్ ప్రాజెక్టు కింద 15 రోజుల తర్వాత సమస్య వస్తే సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చిద్దామని తెలిపారు. దీంతో మంగళవారం నుంచి యథాతథంగా వేరుశనగకాయల మార్కెట్ ప్రారంభిస్తామని యార్డు సెక్రటరీ కల్పన తెలిపారు. పాసింగ్ వ్యవస్థపై గత వారం రోజులుగా మూతపడిన వేరుశనగకాయల మార్కెట్ యార్డు మంగళవారం ప్రారంభమవుతుందని రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

బడికి తాళం.. చర్చిలో పాఠం



పెచ్చులూడిన దృశ్యం



చర్చి ఆవరణలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కోసిగి: సాతనూరు కొట్టాల గ్రామ ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడటంతో విద్యార్థుల క్షేమం దృష్ట్యా బడిని చర్చిలోకి మార్చారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పిన విషయం అందిరికీ తెలిసిందే. సోమవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ గదిలో పడిన సిమెంట్ పెచ్చులు చూసి భయాందోళన చెందారు. పైకప్పు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాలకు ఒకే గది ఉండడంతో హెచ్ఎం పాఠశాలకు తాళం వేసి గ్రామస్తుల సహకారంతో పక్కనే ఉన్న చర్చి ప్రాంగణంలో పాఠాలు బోధించాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న ఎంఈఓ–2 శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని పాఠశాల పరిస్థితిని సమీక్షించారు. చాలా కాలం క్రితం నిర్మించిన పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరిందని గుర్తించారు. ఇకపై పాఠశాలలో తరగతులు నిర్వహించొద్దని హెచ్ఎంకు సూచించారు. గత ప్రభుత్వంలో నాడు–నేడు రెండవ విడత కింద పాఠశాల ఎంపికైందని, అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులు మొదలు పెట్టలేకపోయామని ఏఈ రంగరాజు తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.